# ఏపీకి రూ.185.97 కోట్లు

**● కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ● వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగం**

ఈనాడు–తిరుపతి

**స్వ**చ్ఛ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ఏపీకి రూ. 185.97 కోట్లు ఈ ఏడాది ఇస్తున్నామని కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఎం. వెంకయ్యానాయుడు పేర్కొన్నారు. తిరుపతిలో ఆదివారం నిర్వహించిన ఓడీఎఫ్ సభ జరుగుతున్న సమయాన ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొద్ది నిమిషాల పాటు మాట్లాడారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని తిరుపతి వేదికగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి మొదటగా రూ. 131 కోట్లు ఇచ్చిందని.. ఈ విడత పెద్దమొత్తాన్ని ప్రకటించిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపునందుకుని ఏపీలో స్వచ్ఛత కార్యక్రమాలు చక్కగా సాగుతున్నాయన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకించి ముఖ్యమంత్రి సల్పుతోన్న కృషి ఎనలేనిదన్నారు. గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చుదామని.. మన దేశం స్వచ్ఛభారతంగా మారాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛభారత్‌కు సంబంధించి రూపొందించిన లఘుచిత్రాలను ప్రతి విద్యాసంస్థలో తప్పనిసరిగా ప్రదర్శించాలని.. ఇందుకుతగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్వచ్ఛ కార్యక్రమాలను విరివిగా చేపట్టి నవ్యాంధ్ర దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచేలా చూడాలని కేంద్రమంత్రి వెంకయ్యానాయుడు పిలుపునిచ్చారు.